
గుడిమల్కాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు


గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా వద్ద.. బంగారి ప్రకాష్ తదితరులు


బహుమతులు అందజేస్తున్న అమర్‌సింగ్, శివయాదవ్, లక్ష్మీనారాయణ, రాజ్‌పోల్

21న ఇండీ డాగ్ షో

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 21న దోమలగూడలోని చైతన్య విద్యాలయంలో 'లవ్ మై ఇండీ డాగ్ షో' రెండవ ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లవ్ మై ఇండీ డాగ్ షో అనేది అన్ని వర్గాలకు చెందిన వారిని ఒక చోటుకు తీసుకురావంతో పాటు వీధి కుక్కలకు అవకాశం కల్పించడానికే ఈ కార్యక్రమం అని పేర్కొన్నారు. షోలో పాల్గొనేందుకు ప్రవేశం ఉచితమని అయితే ముందస్తుగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మార్స్ పెట్‌కేర్ సౌజన్యంతో ఈ షోలో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు



గోల్కొండ: అయ్యప్ప స్వామి నామస్మరణతో షేక్‌పేట్ గుట్టపోచమ్మ ఆలయ పరిసరాలు మారుమోగాయి. అయ్యప్ప స్వాములు శుక్రవారం శబరిమల బయలుదేరి వెళ్లారు. గురుస్వామి హరి ఆధ్వర్యంలో మొత్తం 18 మంది స్వాములు ఇరుముళ్లతో శబరిమల బయలుదేరి వెళ్లారు. కాగా శబరికి వెళ్తున్న స్వాములను అయ్యప్ప భక్తులు నమస్కారాలు చేస్తూ వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

గుడిమల్కాపూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


కార్యక్రమంలో కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు, మహిళల కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక ఉపాధి పథకాలు ప్రవేశపెట్టి బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలు ఇస్తున్నారన్నారు. ఈ యాత్రలో బ్యాంకు అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు ఆధార్ కేంద్రాల వారు కూడా పాల్గొంటున్నారని ఆయన అన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కన్వీనర్‌లు వినేష్‌సింగ్, కట్ట నర్సింగ్‌రావు, గోవర్ధన్ తదితరులున్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను వేధించడం ఆపాలి


నగర కొత్వాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులకు చలాన్‌లు వేస్తూ వేధించడం ఆపాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ నగర కొత్వాల్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన చార్మినార్ ఎమ్మెల్యే మిర్ జుల్ఫికార్ అలీతో కలిసి నగర కొత్వాల్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ రోడ్డు, రేతిబౌలి, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ వ్యాపారులను వేధిస్తున్నారని, వారికి చలాన్‌లు వేస్తున్నారని అన్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్నో సార్లు ఫుట్‌పాత్ వ్యాపారులు తమను వేధించడం ఆపాలని కోరుకున్నా కూడా వేధింపులు ఆగడం లేదని ఆయన అన్నారు. ఈ విషయంపై ట్రాఫిక్ జాయింట్ సీపీ, ట్రాఫిక్ ఏసీపీలతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని నగర కొత్వాల్ శ్రీనివాస్‌రెడ్డి తనను కలిసి ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

నోరూరించే అవధ్ వంటకాలు



గోల్కొండ: అవధ్ ప్రాంతపు నవాబుల వంటకాల రుచిని నగర వాసులకు కూడా అందిస్తున్నామని టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని అవధ్ రెస్టారెంట్ మెనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని అవధి దస్తర్‌ఖాన్ రెస్టారెంట్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన అవధ్ ప్రాంతపు వంటకాల వివరాలను వెల్లడించారు. లక్నోతో పాటు దాని పరిసరాల్లో నవాబుల వంటకాలైన కబాబ్స్, డెసర్ట్‌లను తమ రెస్టారెంట్‌లో ప్రత్యేకమైన రుచులతో అందిస్తున్నామని ఆయన తెలిపారు. వీటన్నిటిలో మటన్ గెలౌటీ కబాబ్ నగరంలోని మరే రెస్టారెంట్‌లో లేదని, ఇది కేవలం తమ రెస్టారెంట్‌లోనే ఉందన్నారు. చికెన్ కత్తి కబాబ్ తమ రెస్టారెంట్‌లోని అన్నిటికంటే ప్రత్యేకమైన డిష్ అని ఆయన పేర్కొన్నారు.

శక్తి సూపర్ షీ కోఆర్డినేటర్‌గా కొత్త విద్యారెడ్డి



గన్‌ఫౌండ్రీ: యువజన కాంగ్రెస్ అనుబంధ శాఖ అయిన శక్తి సూపర్ షీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కొత్త విద్యారెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ..తెలంగాణలో మహిళా సాధికారత, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

ఉస్మానియాలో బ్యాటరీ వాహనం ప్రారంభం



అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అన్నారు. శుక్రవారం ఉస్మానియా ఆస్పత్రిలో రోగుల సహాయార్థం బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించి, అందులో ఆర్‌ఎంఓ డాక్టర్ ఎండీ రఫీతో ప్రయాణించారు. ఆస్పత్రిలోని అవుట్ పేషంట్ బ్లాకు నుంచి కులీకుతుబ్‌షా భవనం వరకు రోగులకు తరలించేందుకు బ్యాటరీ వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రూ.100 కోసం స్నేహితుడిపై కత్తితో దాడి

విజయనగర్‌కాలనీ: మద్యం తాగేందుకు రూ.100 ఇవ్వలేదని స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన శుక్రవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జిర్రా హరిదర్గాలో నివసించే మహ్మద్ షరీఫ్, దినసరి కూలి. ఇతని స్నేహితుడు మహ్మద్ సల్మాన్ జిర్రా నట్రాజ్‌నగర్ నివాసి. ఇతడు కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సల్మాన్ మద్యం తాగేందుకు స్నేహితుడైన మహ్మద్ షరీఫ్‌ను రూ.100 అడిగాడు. అతడు డబ్బులు లేవని చెప్పడంతో ఆగ్రహానికి గురైన సల్మాన్ పక్కనే ఉన్న మాసం దుకాణం నుంచి కత్తిని తీసుకువచ్చి దాడి చేశాడు. అంతేకాకుండా తలపై కొట్టి గాయపరిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు మహ్మద్ షరీఫ్‌ను వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద


ఇస్సామియాబజార్‌లో.. లక్ష్మణ్‌రావు


నివాళులర్పిస్తున్న నాయకులు

గోల్కొండ: స్వామి వివేకానంద జయంతిని వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ చౌరస్తా వద్ద దేవర వంశీ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌యాదవ్, గంగాధర్, రాధాకృష్ణ, అశ్విన్, రక్షిత్, సాగర్ తదితరులున్నారు. గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. జూపల్లి భాస్కర్, తిరుమల్లేష్, పద్మ, మంగ తదితరులున్నారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం..

సుల్తాన్‌బజార్: స్వామి వివేకానంద అడుగుజాడల్లో నేటి యువత నడవాలని బజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్.లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. జాతీయ యువజన దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఇస్సామియాబజార్‌లోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పలువురు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని అన్నదానం చేశారు. గడ్డం సతీష్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి..

జియాగూడ: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అమర్ సింగ్ అన్నారు. శుక్రవారం జియాగూడ 2బి హెచ్‌కే వద్ద స్వామి వివేకానంద జయంతి వేడుకలకు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించి యువజన క్రీడోత్సవాల్లో గెలుపొందిన యువ కులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గోల్కొండ జిల్లా డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సిములు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఇంద్రసేనారెడ్డి యూత్ అధ్యక్షుడు రాజ్‌పోల్, రమేష్ చౌగ్లే తులసిదాస్, భాస్కర్ గుప్తా, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉస్మానియాలో..

అఫ్జల్‌గంజ్: స్వామి వివేకానంద జయంతిని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం భారతీయ మజ్దూర్ సంఘ్ ఉస్మానియా యునిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాంగేందర్, ఆర్‌ఎంఓ-1 డాక్టర్ శేషాద్రి, డాక్టర్లు పాండూ నాయక్, డాక్టర్ ఎండి రఫీలు తదితరులు పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తిరుమల నుండి తీసుకువచ్చిన తిరుమల తిరుపతి దేవాస్థానం క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. బీఎంఎస్ ఆల్ ఇండియా అడ్వైజర్ అల్లూరి రవిశంకర్, సిటీ జనరల్ సెక్రటరి సాహిత్య సమరత, యునిట్ అధ్యక్షుడు గొల్లపల్లి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పాతబస్తీలో..

చార్మినార్: స్వామి వివేకానంద జయంతి వేడుకలు పాతబస్తీలో ఘనంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో వివేకానంద చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. పాతబస్తీ దారుషిఫాకు చెందిన బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొని నివాలర్పించారు.

ఛత్రినాక చౌరస్తాలో..

గౌలిపురా: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం ఛత్రినాక చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకుడు ఎస్.పి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బి.వెంకటేశ్ చారి, ఎస్‌ప్రణీత్, వి.అఖిల్, శ్యామ్, ప్రసాద్, అంజయ్య, కల్యాణ్, అభిలాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో...

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గౌలిపురా మార్కెట్‌లో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వీహెచ్‌పీ ఆర్యనగర్ జిల్లా అధ్యక్షులు విశాల్ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు పవన్‌కుమార్, శ్వేత, శ్రీను పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నాగేందర్ తదితరులు


నివాళులర్పిస్తున్న ఎస్.పి.క్రాంతి కుమార్


గౌలిపురా మార్కెట్‌లో..

ముస్తాబైన కోవెల రంగనాయక స్వామి ఆలయం



గోల్కొండ: తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. సంక్రాంతి జాతర పేరున ఈ ఆలయ వేడుకలు నిర్వహించడం ఈ ఆలయానికి ఉన్న ప్రత్యేక నేటికీ ఈ ఆలయం సంక్రాంతి జాతర వేడుకలు భారీగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం సంక్రాంతి జాతర వేడుకలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో సంక్రాంతి జాతర, ముగ్గుల పోటీలు తదితర వాటికి చకచక ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంక్రాంతి ఉత్సవ వేడుకలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు జరుగుతాయి. 14న ఉదయం 9 గంటలకు విష్వేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అదేరోజు ఆలయ ప్రాంగణంలో మహిళల కోసం రంగోళి పోటీలు నిర్వహిస్తారు. అదేరోజు ఆలయ కేలండర్‌ను ఆవిష్కరిస్తారు. 15న మండప పూజ, నిత్య అర్చన, హవన కార్యక్రమాలు ఉంటాయి. 16న ఉదయం 9 గంటలకు మండప పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అదే రోజు రంగోళి పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తారు. జాతర జరిగే మూడు రోజులు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు.

సంక్రాంతికి ఊరు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించండి


ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు

అబిడ్స్: సంక్రాంతికి ఊరు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు సూచించారు. ఇళ్లలో విలువైన డాక్యుమెంట్లు కానీ, వస్తువులు కానీ, బంగారం కానీ ఉంటే బ్యాంక్ లాకర్లలో పెట్టాలన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..ఊర్లకు వెళ్లేవారు తమకు సమాచారం అందిస్తే రాత్రిల్లో ప్రత్యేక నిఘా వేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రతగా ఉండాలని సూచించారు. ఇళ్లల్లో విలువైన వస్తువులు పెట్టకపోవడమే ఎంతో మంచిదన్నారు. అపార్టుమెంట్లు, పెద్ద బంగ్లాల వారు సీసీ కెమెరాలు స్వయంగా ఏర్పాటు చేసుకుంటే వారికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత వహించి పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు పేర్కొన్నారు.

ఘనంగా పీజేఆర్ జయంతి


చార్మినార్ వద్ద పతాకావిష్కరణ చేస్తున్న నిరంజన్

అబిడ్స్: రాష్ట్ర సీఎల్పీ నాయకుడు పీజేఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పీజేఆర్ చిత్రపటానికి గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు మనిలాల్‌షా, రాజేందర్ యాదవ్, ప్రేమ్‌లత అగర్వాల్, నర్సింగ్‌రావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజా సంక్షేమానికి, ప్రజా అభ్యున్నతికి పీజేఆర్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు.

దూద్‌బౌలి: మాజీ సీఎల్పీ నాయకుడు పి.జనార్దన్‌రెడ్డి జయంతి వేడుకలను పురస్కరించుకుని చార్మినార్ కట్టడం వద్ద శుక్రవారం రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి అధ్యక్షుడు జి.నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.కన్నయ్యలాల్, కాశమోని శ్యాంరావు ముదిరాజ్ జాఫ్రీ పాల్గొన్నారు.


పీజేఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మనిలాల్‌షా తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ధూల్‌పేట్ అండర్ గ్రౌండ్, జాలి హనుమాన్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ఆర్యసమాజ్, మిని స్టేడియం, ఎమ్మెల్యే క్వార్టర్స్, బల్‌రామ్ గల్లీ, జాలి హనుమాన్, బడీగల్లీ, మహంకాళీ ఆలయం, జుంగురు బస్తీ, సిత్లామాతా ఆలయం, హెచ్‌పీ పెట్రోల్ పంప్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ ఆర్‌కే పేట్, ధూల్‌పేట్ ఓవర్‌హెడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్, అజారి హోటల్, బిలాల్ మజీద్, గంగాబౌలీ, బంగ్లాదేశ్ గల్లీ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. 11 కేవీ మహాలక్ష్మి నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని శివ్‌లాల్ నగర్, కుమ్మర్‌వాడి, మార్వాడిబస్తీ,, గాంధీ విగ్రహం, హనుమాన్ పీటీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.


వెంకట్‌రావు స్మారక ఉన్నత పాఠశాల ఆత్మీయ సమ్మేళనం


భోగి వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు


విద్యాశ్రీ హైస్కూల్‌లో..

సందడిగా సంక్రాంతి వేడుకలు


సంక్రాంతి సంబరాల్లో పాఠశాల డైరెక్టర్ శైలేందర్ సింగ్


స్కూల్ ఆవరణలో రంగోళి పోటీలు, హాజరైన డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే

జియాగూడ: జియాగూడ విద్యాశ్రీ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం స్కూల్ డైరెక్టర్ శ్యామ్‌వెరా, ప్రిన్సిపల్ సునీత శ్యామ్‌వెరాల ఆధ్వర్యంలో వేడుకలు జరుగగా చిన్నారి విద్యార్థులకు సంక్రాంతి భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. అలాగే రంగోళి కార్యక్రమం, భోగిమంటలు తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

సరస్వతి విద్యానికేతన్ స్కూల్‌లో..

సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులకు రంగోళి పోటీలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్కూల్ ఆవరణలో డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే, ప్రిన్సిపల్ సునేత్ర కౌలేల ఆధ్వర్యంలో ఏర్పాటైంది. సుమారు 100కు పైగా విద్యార్థులు రంగోళీ పోటీల్లో పాల్గొనగా గెలుపొందిన వారికి జనవరి 26న బహుమతులను ప్రదానం చేస్తున్నట్లు బాల్‌రాజ్ కౌలే తెలిపారు.

ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో..

అబిడ్స్: సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇండియన్ పబ్లిక్‌స్కూల్ సీతారాంబాగ్, బేగంబజార్ ప్రాంతాల్లోని పాఠశాలల్లో శుక్రవారం వేడుకలు పెద్ద ఎత్తున చేపట్టారు. భోగి వేడుకలు, ఇతర పలు సంక్రాంతి వేడుకలు చేశారు. పాఠశాల డైరెక్టర్ శైలేందర్ సింగ్ విద్యార్థులకు భోగిపండ్లు వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను చాటే విధంగా తమ పాఠశాల విద్యార్థులకు అన్ని పండుగలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆత్మీయ సమ్మేళనం, సంక్రాంతి సంబరాలు..

గౌలిపురా: గౌలిపురాలోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వెంకట్‌రావు స్మారక ఉన్నత పాఠశాల సీనియర్ అండ్ జూనియర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి, బీజేపీ సీనియర్ మహిళా నాయకురాలు తారకేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, సీనియర్ క్రీడాకారులు బి.జానకీరామ్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, అంబేద్కర్ పాఠశాల కార్యదర్శి ప్రసాద్‌లు పాల్గొనగా.. ముగ్గుల పోటీల్లో రీమా, రక్షిత, మల్లేశ్వరి, ఫుడ్ ఫెస్టివల్‌లో టి.స్వప్న, బి.స్వాతి, దీపిక, కైట్ ఫెస్టివల్‌లో దీపిక, మాధవి, మౌనిక, వైష్ణవిలకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ఇన్‌చార్జి, హెచ్‌ఎం వాణి, పూర్వ విద్యార్థులు రాఘవేంద్ర, మహేశ్, రవి, దేవేందర్ పాల్గొన్నారు.